చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం

పెడన: పట్టణంతో పాటు మండలంలోని పలు అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు గురువారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. పట్టణంలోని ఐదో వార్డులో ఉన్న అంగన్వాడీ సెంటరులో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా చిన్నారులతో సామూహిక అక్షరభ్యాసం చేయించారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు. మండల పరిధిలోని గురువిందగుంట అంగన్వాడీ కేంద్రంలో ఎంపీపీ రాజులపాటి వాణి, కొంగంచర్ల సర్పంచు లోయ ఊహ, గురువింద గుంట సర్పంచ్ పుప్పాల స్వరూపరాణి చిన్నారులతో సామూహిక అక్షరభ్యాసం చేయించారు. వారికి పలకలు, బలపాలు అందజేశారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ టి. కల్పవల్లి, హెల్త్ సూపర్వైజర్, అంగన్వాడీ సిబ్బంది, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

బంటుమిల్లి మండలంలో..

బంటుమిల్లి: మండలంలోని అంగన్వాడీ కేంద్రాల్లో సమగ్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం ఘనంగా నిర్వహించారు. బంటుమిల్లి వెలుగు కార్యాలయంలో ఎంపీపీ వెలివెల చినబాబు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. ఆయా గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ముఖ్యఅతిథులు పాల్గొని చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు సీడీపీఓ ఎం. సముద్రవేణి ఈ కార్యక్రమ ఉద్దేశాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ నీరజాక్షి, ఈఓపీఆర్‌డీ శైలజకుమారి, ఎంపీటీసీ సభ్యులు పాపాని భగవాన్, కె.లక్ష్మీ, సర్పంచులు బందారు చంద్రశేఖర్, పామర్తి వెంకటేశ్వరరావు, రేవు శ్రీనివాసరావు, రేవు గోపాలకృష్ణ, డి.సియోన్‌కుమారి, గొల్ల బాలయేసు, సూపర్వైజరు నాగలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు మాదాసు వెంకటేశ్వరరావు, కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు, సచివాలయ కార్యదర్శి రూన్నీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల్లో స్వేచ్ఛాయుత వాతావరణంలో విద్యాబోధన

చల్లపల్లి: ఒత్తిడికి దూరంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో పిల్లలు విద్యను అభ్యసించేందుకు అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూపర్వైజర్ సీహెచ్.ఆదిలక్ష్మి తల్లిదండ్రులకు సూచించారు. అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా స్థానిక నిమ్మలతోటలోని అంగన్వాడీ కేంద్రంలో గురువారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత సరస్వతీ దేవి పూజ చేసి పిల్లలతో బియ్యంలో అక్షరాలు దిద్దించారు. అనంతరం పలకలు, బలపాలు పంపిణీచేశారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో విద్యను బోధిస్తామన్నారు. మహిళా సంరక్షణ కార్యదర్శి వేమూరి లావణ్య మాట్లాడుతూ.. పిల్లలకు సులభమైన పద్ధతిలో చదువు చెప్పడంతోపాటు పౌష్టికాహారాన్ని కూడా అందిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు శివసాయికుమారి, గంగాభవాని, పిల్లల తల్లులు పాల్గొన్నారు.


చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఆదిలక్ష్మి, వేమూరి లావణ్య తదితరులు


బంటుమిల్లిలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేస్తున్న ఎంపీపీ చినబాబు తదితరులు

అమ్మ ఒడి లాంటివి అంగన్వాడీ కేంద్రాలు

ఘంటసాల: అమ్మ ఒడి లాంటి అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్పించడం ద్వారా వారికి ఆరోగ్యం, ఆనందం, విద్య లభిస్తాయని ఎంపీపీ వేమూరి రజని కుమారి సూచించారు. ఘంటసాల నందం బజారులోని అంగన్వాడీ కేంద్రంలో గ్రామ పరిధిలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల చిన్నారులకు అక్షరభ్యాస కార్యక్రమం ఎంపీపీ వేమూరి రజని కుమారి, సర్పంచ్ బాణావత్తు వెంకటేశ్వరమ్మల చేతుల మీదగా గురువారం జరిగింది. ఐసీడీఎస్ ఘంటసాల సెక్టార్ సూపర్ వైజర్ టి.రమానాగమణి మాట్లాడుతూ.. సెక్టార్ పరిధిలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అక్షరభ్యాసం చేయించడంతో పాటు అంగన్వాడీ పిలుస్తోంది ర్యాలీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌కే రాజ్యలక్ష్మి, మాధురి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు. మండల పరిధిలోని మల్లంపల్లి సచివాలయ పరిధిలోని 1,2,4 అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులు సర్పంచ్ బెల్లంకొండ అమలేశ్వరరావు, దేవరకోట అంగన్వాడీ కేంద్రాల్లో సూపర్వైజర్ టి.రమానాగమణి చిన్నారులకు అక్షరభ్యాసం చేయించారు.


పెడనలో చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ ఖాజా


గురువిందగుంట చిన్నారులకు పలకలు, బలపాలు అందజేస్తున్న ఎంపీపీ వాణి తదితరులు


ఘంటసాల ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ రజని కుమారి, సర్పంచ్ వెంకటేశ్వరమ్మ

16న గూడూరు మండల సర్వసభ్య సమావేశం

గూడూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 16వ తేదీన జరుగుతుందని ఎంపీడీఓ మోటేపల్లి వనజ గురువారం తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీపీ సంగా మధుసూదనరావు అధ్యక్షతన సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

నేలకు అనువైన వంగడాలతో అధిక దిగుబడులు

చల్లపల్లి: భూసార పరీక్షలకు అనుగుణంగా నేలకు అనువైన వరి వంగడాలను ఎంచుకుని సాగు చేపడితే అధిక దిగుబడులు సాధించొచ్చని కృషి వి/జ్ఞాన కేంద్రం (ఘంటసాల) శాస్త్రవేత్త డాక్టర్ నవీన్ రైతులకు సూచించారు. మండలంలోని లక్ష్మీపురం సచివాలయం వద్ద గురువారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ.. పచ్చిరొట్ట ఎరువుల సాగు వల్ల నేల సారవంతం అవుతుందని, తద్వారా ఎరువుల ఖర్చు తగ్గడంతోపాటు అధిక దిగుబడులు వస్తాయన్నారు. ఏఏ నేలలకు ఏఏ వరి వంగడాలు అనుకూలంగా ఉంటాయో వివరించారు. మరో శాస్త్రవేత్త డాక్టర్ వీరయ్య మాట్లాడుతూ.. వరి, మినుమును ఆశించే చీడపీడలు, వాటి నివారణ పద్ధతులను వివరించారు. వ్యవసాయానికి సంబంధించిన వివిధ పథకాలపై మొవ్వ విభాగం ఏడీఏ శ్యామల అవగాహన కలిపించారు. మండల వ్యయసాయాధికారి సాయిసింధు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ అనిత, డాక్టర్ పద్మావతి, ఉద్యాన శాఖ అధికారి కీర్తి, లక్ష్మీపురం సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు, పంచాయతీ సెక్రటరీ ఉమామహేశ్వరరావు, అగ్రికల్చరల్ విలేజ్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రశాంతంగా మెగా డీఎస్సీ పరీక్షలు



పెడన: మండలంలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో మెగా డీఎస్సీ పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయని ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రాజారమేష్, అడ్మిన్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగన ఈ పరీక్షకు 181 మంది అభ్యర్థులకు 171 మంది హాజరయ్యారని, మరో పది మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగిన రెండో సెషన్ పరీక్షకు 69 మంది అభ్యర్థులకు 48 మంది హాజరయ్యారని, 21 మంది గైర్హాజరయ్యారని వివరించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పరీక్ష జరిగిందని పేర్కొన్నారు.

గూడూరు వ్యవసాయ అధికారిగా శివరామకృష్ణ



గూడూరు: మండల వ్యవసాయశాఖాధికారిగా జి.శివరామకృష్ణను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బంటుమిల్లి ఏఓగా పనిచేస్తున్న ఆయన బదిలీపై గూడూరు మండలానికి వచ్చారు. గూడూరు ఏఓగా పనిచేస్తున్న కె.ఆంజనేయకుమార్‌ను గుంటూరులోని వ్యవసాయశాఖ కార్యాలయానికి బదిలీ చేశారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ బదిలీపై వెళ్తున్న ఆంజనేయకుమార్‌ను సత్కరించారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



మచిలీపట్నంటౌన్: బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని క్రై సంస్థ ప్రతినిధి కె.సుధారాణి అన్నారు. తమ సంస్థ బాలల హక్కుల పరిరక్షణ కోసం కృషిచేస్తోందన్నారు. గురువారం బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నగరంలోని గిలకలదిండిలో సుధారాణి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ నెల పదో తేదీ నుంచి గురువారం వరకు మూడు రోజులు పాటు బందరు మండలం లోని 18 గ్రామాల్లో తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. క్రై సంస్థ గిలకలదిండి ఇన్‌చార్జి వాటపల్లి రమేష్ చదువు ప్రాముఖ్యతను బాలల తల్లిదండ్రులకు వివరించారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ కర్రి కుమార్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని ప్రభావతి, సచివాలయం సిబ్బంది, తల్లిదండ్రులు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం



గూడూరు: రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం రెండింటికీ సమ ప్రాధాన్యం ఇస్తూ కూటమి ప్రభుత్వం ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నదని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో విద్యార్థులకు సర్వేపల్లిరాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను ఎమ్మెల్యే గురువారం పంపిణీ చేశారు. అనంతరం రైతులకు రాయితీ వరి విత్తనాలు, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేశారు. డ్వాక్రా మహిళలకు మంజూరైన రుణాల చెక్‌లను ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.వనజ, డీవైఈఓ బి.ఎస్.సి.శేఖర్‌సింగ్, ఏఓ కె.ఆంజనేయకుమార్, కూటమి నాయకులు పోతన స్వామి, పంచకర్ల సురేష్, పోలపల్లి రజని తదితరులు పాల్గొన్నారు.

ట్రాలీ ఢీకొని వృద్ధుడి దుర్మరణం

నందివాడ: పొక్లెయిన్ ట్రాలీ ఢీకొని వృద్ధుడు దుర్మరణం చెందిన ఘటన నందివాడ మండలం, జనార్దనపురం పంచాయతీ పరిధిలోని టెలిఫోన్ నగర్ వద్ద గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రావూరి భిక్షం (69) తన స్వగ్రామమైన అరిపిరాల నుంచి ద్విచక్ర వాహనంపై గుడివాడ వెళ్తుండగా టెలిఫోన్ నగర్ వద్దకు వచ్చే సరికి పొక్లెయిన్ వాహనం వెనక్కి రివర్స్ చేస్తుండగా భిక్షంకి తగిలి తీవ్ర గాయమైంది. వైద్యం నిమిత్తం గుడివాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.శ్రీనివాస్ తెలిపారు.

ట్యాంకులను క్లోరినేషన్ చేయించండి

ఎంపీపీ వెలివెల చినబాబు

బంటుమిల్లి: మండలంలోని అన్ని పంచాయతీల పరిధిలో ఉన్న రక్షిత మంచినీటి పథకాల ట్యాంకులు, సంపులు, ఊట బావుల్లో క్లోరినేషన్ చేయించాలని అధికారులను ఎంపీపీ వెలివెల చినబాబు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశం సమావేశ హాలులో బుధవారం శ్లాబు ఉంచి పెచ్చులు ఊడిపడటంతో వాయిదా పడింది. ఈ నేపథ్యంలో ఈఓపీఆర్‌డీ, ఇన్‌చార్జి ఎంపీడీఓ నీరజాక్షి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగేశ్వరరావుతో ఎంపీపీ సమావేశం నిర్వహించారు. రెండు నెలలుగా కురుస్తున్న వర్షాల కారణంగా తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉన్నందున గ్రామాల్లోని ఊట బావులను క్లోరినేషన్ చేయించాలని ఆదేశించారు. పంచాయతీల పరిధిలోని వాటర్ ట్యాంకులు, సంపులను నిబంధనల మేరకు శుభ్రం చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలుషిత నీరు తాగే ప్రజలు డయేరియా బారిన పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. పంచాయతీ అధికారులు స్పందించి వెంటనే వాటర్ ట్యాంకులు, సంపులు, ఊట బావులను క్లోరినేషన్ చేయించాలని సూచించారు. ఈఓపీఆర్‌డీ శైలజకుమారి మాట్లాడుతూ.. బావులు, ట్యాంకులను క్లోరినేషన్ చేయించి, నీటిని కాచి చల్లార్చి తాగాలని ప్రజలకు అవగాహన కలిగిస్తామన్నారు. ఈ సమావేశంలో సాతులూరు, ఆముదాలపల్లి సర్పంచ్‌లు గొల్ల బాలఏసు, డి.సియోన్‌కుమారి, పంచాయతీ కార్యదర్శులు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మాదాసు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ చినబాబు

తప్పిన ప్రమాదం

మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం రాత్రి శ్లాబు పెచ్చులు ఊడి సీలింగ్ సహా కింద పడ్డాయి. గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరగాల్సి ఉంది. ఈ సమావేశంలో శ్లాబు పెచ్చు పడిన స్థానంలో మండల స్థాయి అధికారులు నివేదికలు ఇచ్చేందుకు కూర్చుంటారు. రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి శ్లాబు నాని ఊడి పడిపోయింది. దీంతో సమావేశాన్ని వాయిదా వేశారు. మండల పరిషత్ భవనం నిర్మించి దాదాపు 50 సంవత్సరాలు దాటుతున్నందున ప్రస్తుత పరిస్థితులపై కొత్త భవనం మంజూరుకు జెడ్పీ సీఈఓ దృష్టికి తీసుకెళ్తామని ఎంపీపీ చినబాబు పేర్కొన్నారు. భవనం మరమ్మతుల పేరుతో 15 ఏళ్ల క్రితం రూ.లక్షలు ఖర్చు చేశారు. ఆ పనులను నామినేషన్ పద్ధతిలో చేయడంతో అధికారులు, నాయకులు సొమ్ము చేసుకున్నారన్న విమర్శలు ఉన్నాయి. పైగా అనేక విలువైన పత్రాలు, డాక్యుమెంట్లు తడిసిపోతే వాటిని కాల్చివేశారు. మరమ్మతులు చేసిం తర్వాత అనేకసార్లు శ్లాబు పెచ్చులు ఊడి పడ్డాయి.


సమావేశ మందిరంలో ఊడిన శ్లాబును పరిశీలిస్తున్న ఎంపీపీ

విద్యార్థులకు విద్యాకిట్ల పంపిణీ

పెడన: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా అందజేస్తున్న విద్యాకిట్లను సద్వినియోగం చేసుకుని ప్రయోజకులు కావాలని సమగ్ర శిక్ష కృష్ణా జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఆర్.కుముదినిసింగ్ సూచించారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక బంగ్లా స్కూల్లో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను గురువారం పంపిణీ చేశారు. కిట్లలో పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, యూనిఫాం ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 వై.వి.హరనాథ్, సమగ్ర శిక్ష సీఎంఓ టి.రమేష్, హెచ్ఎం ఎ.భాగ్యలక్ష్మి, విద్యాకమిటీ వైస్ చైర్మన్ బాబు, ఉపాధ్యాయ సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోపిదేవి మండలంలో..

మోపిదేవి: మండలంలోని పెదప్రోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్స్‌ను గురువారం పంపిణీ చేశారు. సర్పంచ్ పొలిమెట్ల ఏసుబాబు, హెచ్ఎం ఎ.వెంకట రమణ, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ వై.అనిత, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోడూరు మండలంలో..

కోడూరు: నూతన విద్యాసంవత్సరం ఆరంభం కావడంతో ప్రభుత్వం అందించే సర్వేపల్లి రాధాకృష్ణ స్టూడెంట్ కిట్లను గురువారం విద్యార్థులకు పంపిణీ చేశారు. స్కూల్ బ్యాగ్, యూనిఫామ్, నోట్ పుస్తకాలు, టెస్ట్ పుస్తకాలతో కూడిన కిట్లను అందించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కిట్లను అందించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యా ప్రవేశం ర్యాలీలో తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఎంఈఓ టి.వి.ఎం.రామదాసు పర్యవేక్షించారు.


విద్యార్థి కిట్లను అందజేస్తున్న కుముదిని సింగ్


కోడూరులో కిట్లను అందిస్తున్న ఎంఈఓ రామదాసు, ఉపాధ్యాయులు

యోగాంధ్రను విజయవంతం చేయాలి : ఆర్డీఓ

ఘంటసాల: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బందరు ఆర్డీఓ కె.స్వాతి ఆదేశించారు. ఘంటసాల బౌద్ధ స్తూపం వద్ద శుక్రవారం ఉదయం ఏడు నుంచి ఎనిమిది గంటల వరకు జరిగే యోగాంధ్ర కార్యక్రమంపై అధికారులతో ఆమె గురువారం సమీక్ష నిర్వహించారు. అనంతరం బౌద్ధ స్తూపం ప్రాంగణాన్ని, ఏర్పాట్లను ఆర్డీఓ స్వాతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. యోగాకు వచ్చే ప్రజలు, విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వచ్చిన ప్రజలకు సౌకర్యాలు కల్పించాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, కలెక్టర్ డి.కె. బాలాజీ, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఘంటసాల బౌద్ధ స్తూపం వద్ద జరిగే యోగాంధ్ర కార్యక్రమం రాష్ట్రానికే ఆదర్శంగా ఉండేలా ప్రత్యేక ఏర్పాట్లు, చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీఓ తెలిపారు. ముందుగా ఘంటసాల జలధీశ్వర స్వామిని ఆర్డీఓ స్వాతి సందర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా అర్చకులు శేషవస్త్రం, స్వామి వారి చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో యోగాంధ్ర కార్యక్రమ జిల్లా సమన్వయ అధికారి, విజిలెన్స్ డెప్యూటీ కలెక్టర్ పోతురాజు, తహసీల్దార్ బి.విజయ ప్రసాద్, ఎంపీడీఓ డి.సుబ్బారావు, డెప్యూటీ ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, ఆర్ఐ కె.శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


ఘంటసాల బౌద్ధ స్తూపాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ స్వాతి తదితరులు

ముగిసిన కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు


ద్వాదశ ప్రదక్షిణలను చేయిస్తున్న భక్తులు

కోడూరు: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. బుధవారం రాత్రి కల్యాణమూర్తులకు పవళింపు సేవను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ప్రత్యేక పల్లకిలో భక్తుల హరినామస్మరణ మధ్య స్వామివార్లకు ద్వాదశ ప్రదక్షిణలు నిర్వహించారు. ఒక్కొక్క ప్రదక్షిణకు ఒక్కొ వాయిద్యాన్ని వాయిస్తూ కార్యక్రమాన్ని కనులపండువగా జరిపారు. అనంతరం పుష్పపరిమళాల నడుమ స్వామివార్లకు శ్రీపుష్పయాగాన్ని నిర్వహించారు. ముందుగా కల్యాణ వేదిక వద్ద సహస్రదీపాల సేవను భక్తిప్రపత్తులతో జరిపారు. ఉత్సవాల ముగింపును పురస్కరించుకొని గురువారం ఉదయం వెంకన్నకు విశేష అలంకారం చేశారు. అనంతరం ఏడు వేల మందికి మహా అన్నసమారాధన జరిగింది. దివిసీమలోని అన్ని ప్రాంతాలకు చెందిన భక్తులు ఈ అన్నసమారాధనలో పాల్గొన్నారు. ఆలయ ప్రధానార్చకుడు దుంభాల శ్రీధరాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేయగా, కమిటీ అధ్యక్షుడు కోట పద్మావతి వరప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.


సహస్రదీపాల నడుమ స్వామివారి ఉత్సవమూర్తులు

రూ.2.64 కోట్లతో వసతి గృహాలు అభివృద్ధి

అవనిగడ్డ: నియోజకవర్గంలో రూ.2.64తో 18 వసతి గృహాలను అభివృద్ధి చేసినట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో 18 ఎస్సీ, బీసీ బాలుర, బాలికల వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసినట్టు చెప్పారు. దీంతో వసతి గృహాల సమస్యలన్నింటినీ పరిష్కరించినట్టయిందన్నారు. వసతులు పెరిగినందున వసతి గృహాల్లో చదివే విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని సూచించారు.

ఫిషరీస్ పాలిటెక్నిక్ క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 15 మందికి ఉద్యోగాలు



నాగాయలంక: మండలంలోని భావదేవరపల్లి మండలి కృష్ణారావు ఫిషరీస్ పాలిటెక్నిక్ కళాశాల – శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయంలో గురువారం జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 17 బ్యాచ్ విద్యార్థులు 15 మందికి ఉద్యోగాలు దక్కాయి. రాష్ట్రంలోని అవంతి ఫీడ్స్ లిమిటెడ్ ప్రతినిధులు ఈ ఇంటర్వ్యూలు నిర్వహించారు. కళాశాలలో ఇప్పటివరకు చదివిన 17 బ్యాచ్‌ల విద్యార్థుల్లో ఎంతోమందికి ఉద్యోగావకాశాలు రావడంతో పాటు చాలా మంది సొంతంగా ఆక్వాలాబ్‌లతో, మరికొందరు ఆక్వా సాగులో స్థిరపడటం సంతోషం కలిగించిందని, మరెన్నో పాలిటెక్నిక్ కళాశాలలకు ఇది ఆదర్శంగా నిలిచిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.చంద్రశేఖరరావు పేర్కొన్నారు. అవంతి ఫీడ్స్ రీజనల్ మేనేజర్ పి.ఎస్.ఎన్.మూర్తి, టెక్నికల్ అసిస్టెంట్ మేనేజర్ డాక్టర్ వై.వి.వి.అశ్వనీకుమార్, అవంతి హెచరీస్ అసిస్టెంట్ మేనేజర్ కె.నాగసాయి బ్రహ్మాజీరావు పాల్గొన్నారు.

42 మందికి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు



బంటుమిల్లి: మండలంలోని బంటుమిల్లి, పెదతుమ్మిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రా (పీహెచ్‌సీ)ల పరిధిలో 42 మందికి గురువారం క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. గతంలో ఇంటింటి సర్వేలో భాగంగా 47 మంది అనుమానితులను గుర్తించారు. వారి కోసం భారత్ ఎలక్ట్రానిక్స్ సంస్థ ఆర్థిక సహకారంతో క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అడ్వాన్స్‌డ్ మొబైల్ డయాగ్నొస్టిక్ యూనిట్‌తో పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజీకి చెందిన వైద్య నిపుణులు సేవలు అందించారు. 42 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి తొమ్మిది మందిని క్యాన్సర్ అనుమానితులుగా గుర్తించారు. మరో పది మందిని మెరుగైన వైద్య పరీక్షల కోసం సిఫార్సు చేశారు. గైనకాలజిస్టులు డాక్టర్ మౌనిక, డాక్టర్ గీతసాయి, రేడియాలజిస్టు డాక్టర్ ఇ.హర్షవర్ధన్‌రెడ్డి, బంటుమిల్లి వైద్యాధికారి పవన్‌కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించారు.

రోడ్డుపై పరీక్షలపై విమర్శలు

క్యాన్సర్ అనుమానితులకు ఆర్టీసీ బస్టాండు ఆవరణలో రోడ్డు పక్కన వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం విమర్శలకు తావిచ్చింది. తొలుత బంటుమిల్లి-1 సచివాలయం వద్ద శిబిరం ఏర్పాటు చేస్తామని సమాచారం ఇచ్చారు. అయితే అక్కడ స్థలం సరిపోదని భావించి పీహెచ్‌సీ వద్ద వైద్య పరీక్షలు చేయాలని నిర్ణయించారు. అయితే అక్కడికి అడ్వాన్స్‌డ్ మొబైల్ డయాగ్నొస్టిక్ యూనిట్ వాహనం వచ్చే పరిస్థితి లేదని బస్టాండు వద్ద రోడ్డు పక్కన షామియానా వేసి పరీక్షలు చేపట్టారు.